చెత్తబండి.. మూలకు చేరెనండి

- చెత్త సేకరణకు తిప్పలు
- మూలకు చేరిన విలువైన యంత్రాలు
- వార్డుల్లో 3 రోజులకొకసారే చెత్త సేకరణ
- పారిశుద్ధ్య పనులపై పర్యవేక్షణ కరువు


తిరువూరు నగర పంచాయతీలో మూలకు చేరిన వాహనాలు

తిరువూరు: పారిశుద్ధ్య పనుల నిర్వహణకు తిరువూరు నగర పంచాయతీలో పలు సమస్యలు ఎదురవు తున్నాయి. 50 వేల జనాభా ఉన్న పట్టణంలో శివారు ప్రాంతాల్లో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించడానికి గతంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి నగర పంచాయతీకి పలు యంత్రాలను కేటాయించారు. మురుగుకాలువలు శుభ్రపరచే బాబ్ కార్ట్, తడి, పొడి చెత్త వేరుచేసి తరలించేందుకు టిప్పింగ్ వ్యాను వీటిలో ఉన్నాయి. చిన్న మరమ్మతుల కారణంగా మూలనపడ్డాయి. మినీ వ్యాన్లు, తోపుడు బళ్లు కూడా మొరాయిస్తున్నాయని తెలుస్తోంది.

ఐదు ట్రాక్టర్లు ఉన్నా..

ప్రస్తుతం నగర పంచాయతీకి ఐదు ట్రాక్టర్లు ఉన్నప్పటికీ మూడు ట్రక్కులు మాత్రమే ఉండటం, ట్రాక్టర్లలో ఒకటి తాగునీటి ట్యాంకరు కోసం కేటాయించడంతో వార్డుల్లో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించడంలో తీవ్ర ఇబ్బంది కలుగుతోంది.

మరమ్మతులు ఎలా..?

నగర పంచాయతీకి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి సరఫరా చేసిన బాబ్ కార్ట్‌కు ఏ మరమ్మతు వచ్చినా ఇక్కడ చేసే పరిస్థితి లేదు. ఈ వాహనానికి అవసరమైన స్పేర్ పార్టులు దొరక్కపోవడం, మరమ్మతులు చేసే టెక్నీషియన్లు లేకపోవడంతో జపాన్ దేశానికి పంపి మరమ్మతు చేయించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. గతంలో ఈ వాహనాలను సరఫరా చేసిన సంస్థతో పలుమార్లు సంప్రదించినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో విలువైన వాహనాలను మూలపెట్టక తప్పలేదు.

సమస్యకు కారణం ఇదీ..

తిరువూరు నగర పంచాయతీకి 2017లో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా గత తెలుగుదేశం ప్రభుత్వం సరఫరా చేసిన పారిశుద్ధ్య వాహనాల విలువ లక్షల్లో ఉంది. అయితే వాటి నిర్వహణ గురించి పట్టించుకోలేదు. మరమ్మతు పనులకు నగర పంచాయతీ సాధారణ నిధుల నుంచి ఖర్చు పెట్టాలని ప్రభుత్వం తెలియజేసింది. ఒక వాహనాన్ని జపాన్‌లోనే బాగు చేస్తారంటున్నారు. నిధుల కొరతతో వాహనాలను మూలనపెట్టారు. ఈ వాహనాలు నగర పంచాయతీకి గుదిబండగా మారాయి.

భారమని..

తడిపొడి చెత్త వేరుచేసే వ్యానుకు మరమ్మతులు చేయడానికి కనీసం రూ.4 లక్షలకు పైగా ఖర్చవుతుందని అధికారులు అంచనా వేశారు. నగర పంచాయతీలో నిధుల కొరత కారణంగా ఈ మరమ్మతులు కూడా చేయించలేని పరిస్థితి నెలకొంది.

కౌన్సిల్ సమావేశాల్లో ప్రస్తావించినా..

పట్టణంలోని పలు వార్డుల్లో చెత్త తరలింపులో జాప్యంతో దోమల బెడద నెలకొందని, దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేయించాలని కౌన్సిలర్లు అధికారులకు మొర పెట్టుకుంటున్నారు. భగత్‌సింగ్ కాలనీ, డ్రైవర్స్ కాలనీ, సుందరయ్య కాలనీ, తంగిళ్లబీడు, సాయిరాఘవ నగర్‌లలో ఇంటింటి చెత్త సేకరణ ప్రతిరోజూ చేయాలని కోరుతున్నారు. నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశాల్లో సైతం కౌన్సిలర్లు ఈ అంశంపై పలుసార్లు ప్రస్తావించినా అధికారులు చర్యలు తీసుకోలేదని వాపోతున్నారు.

పర్యవేక్షణ కరువు..

పట్టణంలో పది వార్డు సచివాలయాలున్నా, తగినంత సిబ్బంది ఉన్నా పర్యవేక్షించే వారు లేకపోవడంతో పారిశుద్ధ్య పనుల నిర్వహణ అధ్వానంగా ఉందని కౌన్సిలర్లు వాపోతున్నారు. శివారు ప్రాంతాల్లో వారంలో రెండు రోజులు మాత్రమే ఇంటింటి నుంచి చెత్త సేకరణ చేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయం అధికారులకు చెప్పినా పట్టించుకోవట్లేదని కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతులు చేయిస్తాం..



స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సరఫరా చేసిన పారిశుద్ధ్య వాహనాలు సాంకేతిక కారణాలతో మూలనపడ్డాయి. వీటికి త్వరలోనే మరమ్మతులు చేయిస్తాం. బాబ్‌కార్ట్ మరమ్మతుకు అవకాశాలు లేకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నాం. చెత్తతరలింపునకు ట్రక్కులు కొనుగోలు చేస్తాం.

– జీ కస్తూరిబాయి, నగర పంచాయతీ చైర్‌పర్సన్, తిరువూరు

దశలవారీగా సమస్యల పరిష్కారం



తిరువూరు: పట్టణంలోని పలు సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక రాజుపేట ఒకటో వార్డులో 'మన వూరు తిరువూరు' కార్యక్రమం రెండో రోజు సోమవారం నిర్వహించారు. స్థానికులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రాగా, ఇప్పటికే పలు సమస్యలను తాను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లానని, తాగునీరు, రహదారులు, డ్రెయినేజీ సమస్యలను నిధుల లభ్యతను బట్టి పరిష్కరిస్తామని తెలిపారు.

ఇరుముడి కార్యక్రమంలో..

కలగర(విస్సన్నపేట): మండలంలోని కలగర గ్రామంలో అయ్యప్ప దీక్షాపరులు ఇరుముడి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు. గ్రామంలో లింక్‌రోడ్డు గురించి గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లగా అవసరమైన రోడ్లను పరిశీలించారు.

నేడు, రేపు క్రిస్మస్ ఆరాధనోత్సవాలు

విస్సన్నపేట: క్రిస్మస్‌ను పురస్కరించుకొని స్థానిక క్రైస్ట్ ఫెలోషిప్ చర్చ్ ఆధ్వర్యంలో ఈ నెల 3, 4వ తేదీలలో పుట్రేల రోడ్డులో సీఎఫ్‌సీ పక్కన గ్రౌండ్‌లో క్రిస్మస్ ఆరాధనోత్సవాలు సాయంత్రం నుంచి నిర్వహిస్తున్నట్టు సంఘ కాపరి బ్రదర్ డెన్నీ ఇశ్రాయేల్ సోమవారం తెలిపారు. దైవజనులు టి.జెఫన్యాశాస్త్రి క్రీస్తు సందేశమిస్తారన్నారు.

క్లుప్తంగా

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



మైలవరం: అర్హులైన ప్రతి పేదవాడికి మూడు సెంట్ల ఇళ్ల స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఆర్థిక సహాయం ప్రభుత్వం మంజూరు చేయాలని జి.కొండూరు మండలం కవులూరు గ్రామ సచివాలయంలో సచివాలయ అధికారి ఈశ్వరరావుకు సీపీఐ మైలవరం నియోజకవర్గ కార్యదర్శి బి. రమేష్‌బాబు సోమవారం వినతి పత్రం అందజేశారు. సీపీఐ రాష్ట్ర సమితి, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం సమష్టి పిలుపు మేరకు వినతిపత్రం అందజేశామన్నారు. కార్యక్రమంలో సీపీఐ కవులూరు గ్రామ కార్యదర్శి డి. శ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎస్కే రబ్బాని, వంశీ, కే.స్వాతి, పీ సుజాత తదితరులు పాల్గొన్నారు.

విశ్వజ్ఞ బ్రహ్మ జయంతి



తిరువూరు: స్వర్ణకార వృత్తికి మూలపురుషుడు విశ్వజ్ఞ బ్రహ్మ జయంతిని కంచి కామాక్షి విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం తిరువూరులో నిర్వహించారు. స్వర్ణకార వృత్తి చేసుకునే విశ్వ బ్రాహ్మణులందరూ విశ్వజ్ఞ బ్రహ్మను స్మరించుకోవాలని సంఘాధ్యక్షుడు వేలేశ్వరపు కుమార రాజా, కార్యదర్శి వురిమెళ్ళ రాంబాబు సూచించారు. స్వర్ణకారుల అభ్యున్నతికి కార్పొరేషన్ ఏర్పాటు చేసినందున సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే కేసులే



తిరువూరు: మైనారిటీ తీర కుండా, లైసెన్సు లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం చట్ట రీత్యా నేరమని తిరువూరు సీఐ గిరిబాబు హెచ్చరించారు. స్థానిక బోస్ సెంటర్లో సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. కళాశాలలు వేళలు ముగిసిన సమయంలో ఆకతాయితనంగా ద్విచక్రవాహనాలపై తిరిగే మైనర్లు, యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి అపరిమిత వేగంతో వాహనాలను నడిపినా, సెల్‌ఫోన్ మాట్లాడుతూ ద్విచక్రవాహనం నడిపినా కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు. ఎస్ఐ వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని కొండపల్లి శాఖ జన విజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షుడు డాక్టర్ మామిడి సీతారామారావు అన్నారు. జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక జెడ్పీ పాఠశాలలో అవగాహన సదస్సు సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో వాయు, నీరు, ఆహారం, ధ్వని, కాంతి కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలుష్యం నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు, హెచ్ఎం శేషగిరిరావు, కార్యదర్శి సర్దార్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ప్రజాదర్బార్

చాట్రాయి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ప్రశాంతి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ 3, 4 తేదీల్లో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అన్ని శాఖల అధికారులతో ఈ దర్బార్ నిర్వహిస్తామని ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని తదనంతరం రశీదు ఇస్తామని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నూజివీడు: ప్రజల సమస్యల పరిష్కారం నిమిత్తం ఈనెల 3,4 తేదీల్లో నిర్వహించనున్న కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజలు ఆయా మండలాల ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో, నూజివీడు పట్టణ ప్రజలు వార్డు సచివాలయాల్లో అర్జీలను అందజేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి కార్యాలయ బాధ్యులు సోమవారం తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 7 గంటల వరకు అర్జీలను అందజేయవచ్చని, వ్యక్తిగత, రెవెన్యూ, డ్రెయినేజీ, రోడ్లు తదితర అన్ని రకాల సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని పేర్కొన్నారు.

రూ.15,485 కోట్ల భారం మోపిన ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు ధ్వజం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: విద్యుత్ చార్జీలు ఒక్క రూపాయి కూడా పెంచబోమని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత ఆరు నెలల్లోనే రూ.15,485 కోట్ల మేర విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపారని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు ధ్వజమెత్తారు. నూజివీడులోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో మాట్లాడారు. హామీలు నెరవేరుస్తారని ప్రజలు ఓట్లేసి గెలిపిస్తే చంద్రబాబు ఓట్లేసిన ప్రజల నెత్తిన ఆర్థిక భారం మోపుతున్నారని విమర్శించారు. సూపర్‌సిక్స్ హామీలను తుంగలో తొక్కి బాదుడు గ్యారంటీ అన్నట్లుగా పాలన సాగిస్తున్నారని దుయ్యబట్టారు. రెండు నెలల క్రితం ట్రూఅప్ చార్జీల పేరుతో రూ.6,072 కోట్లు, ఇప్పుడు తాజాగా ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో మరలా యూనిట్‌కు 92 పైసల చొప్పున రూ.9,412 కోట్ల చొప్పున మొత్తం రూ.15,485 కోట్ల భారాన్ని ప్రజల నెత్తిన మోపిందన్నారు. వంట నూనెలు, నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగి ప్రజల జీవనం భారంగా తయారైందన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కంటే ప్రస్తుత కూటమి ప్రభుత్వ ఆరు నెలల పాలనలోనే అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగాయన్నారు. 2014–19 టీడీపీ పాలనలో విండ్ పవర్‌కు సంబంధించిన పీపీఏలను యూనిట్‌కు రూ.4.84కు, సోలార్ పవర్‌కు సంబంధించి యూనిట్‌కు రూ.5.90 చొప్పున చంద్రబాబు ఒప్పందం కుదుర్చుకున్నారని, అదే జగన్‌మోహన్‌రెడ్డి సెకీతో 2.49 రూపాయలకు ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. దీనిపై ఎల్లో మీడియా అసత్య కథనాలతో తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు సమాధానం చెప్పాలని నిలదీశారు. రోజూ తప్పుదోవ పట్టించే రాజకీయాలు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మాజీ కౌన్సిలర్ కంచర్ల లవకుమార్ పాల్గొన్నారు.

జాతీయ రహదారి మార్జిన్ ఆక్రమణ


తుక్కులూరులో రోడ్డు మార్జిన్‌ను ఆక్రమించి రేకుల షెడ్డు నిర్మిస్తున్న దృశ్యం

నూజివీడు: మండల పరిధిలోని తుక్కులూరు ప్రధాన సెంటర్‌లో జాతీయ రహదారి వెంబడి మార్జిన్లను దుకాణదారులు ఇష్టారాజ్యంగా ఆక్రమిస్తున్నారు. మచిలీపట్నం– నూజివీడు– కల్లూరు 216హెచ్ నేషనల్ హైవే అయిన ఈ రహదారి వెంబడి తారురోడ్డు అంచువరకు ఆక్రమణలు జరుగుతున్నాయి. ప్రధాన సెంటర్‌లో హోటల్ నిర్వాహకుడు తన హోటల్ ముందు భాగంలో హైవే తారు రోడ్డు అంచు వరకు సోమవారం రేకుల షెడ్డు నిర్మించాడు. దీనివల్ల హోటల్‌లోకి వచ్చే వారు తమ వాహనాలను నిలపడానికి చోటు లేక రోడ్డుపైనే నిలిపివేస్తారు. ఇదే జరిగితే రహదారి కుచించుకుపోయి ప్రమాదాలకు ఆస్కారం ఉంది. అసలే జాతీయ రహదారి కావడంతో వాహనాలు అతి వేగంగా రాకపోకలు సాగిస్తుంటాయి. దీనికి తోడు ఈ సెంటర్ రద్దీగా ఉండటం వల్ల ఇప్పటికే ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో యథేచ్ఛగా జరుగుతున్న ఆక్రమణల వల్ల ప్రమాదాలు మరిన్ని జరిగే అవకాశం ఉంది. ఆర్అండ్‌బీ అధికారులు, నేషనల్ హైవే అధికారులు, ఆర్‌డీసీ అధికారులు ఇటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. గతంలో రహదారిని వెడల్పు చేసే సమయంలో ఆక్రమణలను తొలగించేటప్పుడు బాధితులందరికీ పరిహారం ఇచ్చి నిర్మాణాలను తొలగించారు. నష్టపరిహారం తీసుకున్న వారే మళ్లీ రోడ్డును ఆక్రమిస్తున్నారు. దీనిపై తహసీల్దార్ బీవీ సుబ్బారావును వివరణ అడగ్గా రోడ్డు ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి ఆక్రమణలను తొలగిస్తామన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు

ఏసీపీ ప్రసాదరావు

మైలవరం: పట్టణంలో ట్రాఫిక్‌కు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మైలవరం ఏసీపీ వై.ప్రసాదరావు వ్యాపారులు, వాహన చోదకులను హెచ్చరించారు. మైలవరం పట్టణంలో నిత్యం ట్రాఫిక్ సమస్యతో వాహన చోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ సమస్యపై సోమవారం సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ప్రధాన రహదారుల వెంబడి వ్యాపారస్తులు వారి దుకాణాల ముందు చిరువ్యాపారులకు సబ్ లీజ్‌కు ఇవ్వడంతో రోడ్డుపైనే వ్యాపారాలు కొనసాగిస్తున్నారని, దీని వలన ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించమన్నారు. త్వరలో సీసీ కెమేరాలు, ట్రాఫిక్ నియంత్రణకై ప్రత్యేక సిబ్బందిని నియమిస్తున్నట్లు తెలిపారు. సీఐ దాడి చంద్రశేఖర్, ఎస్సై సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటల పోటీలు

ముసునూరు: దివ్యాంగ చిన్నారులకు ప్రోత్సాహం అందించాలని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రమణక్కపేట మెయిన్ పాఠశాలలోని భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంతులైన చిన్నారులకు క్యారమ్స్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు మంగళవారం బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్ టీచర్లు లక్ష్మీ నారాయణ, నాగమల్లేశ్వరి తల్లిదండ్రులు, బాలలు పాల్గొన్నారు.

జెండర్ వివక్షపై అవగాహన

ముసునూరు: లింగ వివక్ష ఆధారంగా జరుగుతున్న హింసను నిరోధించాలని ఎంపీడీఓ జి.రాణి అన్నారు. ముసునూరులో అన్ని ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో లింగ వివక్ష నిరోధక మాసోత్సవ కార్యక్రమాలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చట్టాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు, సెక్టార్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, వైద్యశాఖ, అంగన్‌వాడీ కార్యకర్తలు, మండల సమాఖ్య, మహిళలు పాల్గొన్నారు.

13 మంది జూదరుల అరెస్టు

ఆగిరిపల్లి: మండలంలో పేకాట స్థావరాలపై సిబ్బందితో కలిసి దాడి చేసినట్టు ఎస్ఐ శుభశేఖర్ సోమవారం తెలిపారు. సింహాద్రి అప్పారావుపేటలో పేకాట ఆడుతున్న వారిపై దాడి చేసి ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. వారి నుంచి రూ.10,500 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆగిరిపల్లిలో పేకాట ఆడుతున్న ఏడుగురు జూదరులను అరెస్టు చేసి వారి నుంచి రూ.2,500 నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితులపై కేసులు నమోదు చేసామని పేర్కొన్నారు.

ఆర్థిక సాయం

నూజివీడు: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) సభ్యులైన దుబ్బాక జగ్జీవన్‌రావు ఇటీవల మరణించాడు. ఈ నేపథ్యంలో కేడీసీసీబీ సీఈఓ అమృతలూరు శ్యామ్ మనోహర్ ఉత్తర్వుల మేరకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేల నగదును సోమవారం మృతుడి భార్య దుబ్బాక ఝాన్సీరాణికి పీఏసీఎస్ సీఈఓ నీలం నాగేశ్వరరావు అందజేశారు.

మహిళలను గౌరవించాలి

తిరువూరు: సమాజంలో స్త్రీ, పురుషులు సమానమేనని, మహిళలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని పట్టణ ప్రముఖ వైద్యనిపుణుడు తాళ్ళూరి రామకోటేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం మహిళలపై జరుగుతున్న అకృత్యాల నిరోధంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. నేటి సమాజంలో బాలికలు, మహిళలపై జరుగుతున్న దాడుల నిరోధానికి పౌరులందరూ బాధ్యత వహించాలన్నారు. పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు బాలికలతో మర్యాదగా ప్రవర్తించాల్సిన ఆవశ్యకతను ఉపాధ్యాయులు తెలియజేయాలని సూచించారు. గైనకాలజిస్టు కొడాలి సుజాత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యార్థులకు ఆధార్ క్యాంపులు

విస్సన్నపేట: విద్యార్థులకు అపార్ ఐడీ కార్డుల నిమిత్తం మండలంలో ఆయా పాఠశాలల్లో, గురుకుల పాఠశాలల్లో 3వ తేదీ నుంచి ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ చేకు చిన్నరాటాలు సోమవారం తెలిపారు. 3న విస్సన్నపేట, వేమిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్స్, 4న పుట్రేల, నరసాపురం జిల్లా పరిషత్ హైస్కూల్స్, 5న కొండపర్వ బాలికల గురుకుల పాఠశాల, నరసాపురం బాలికల గురుకుల పాఠశాల, 6న ప్రభుత్వ జూనియర్ కళాశాల, వికాస్ టెక్నోస్కూల్, 7న సిద్దార్థ కళాశాల, శ్రీశ్రీ కళాశాలల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు.

అర్జీలను గడువులోగా పరిష్కరించండి

ఆర్డీఓ మోవిడి వాణి


అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ వాణి

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం)లో వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించాలని ఆర్డీఓ మోవిడి వాణి అధికారులను ఆదేశించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం మీకోసం కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి ఆమె అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో 13 అర్జీలు రాగా వాటిని పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు పంపించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. వెంటనే పరిష్కరించే సమస్య అయితే జాప్యం చేయవద్దని సూచించారు. ఒకవేళ పరిష్కరించడానికి వీలుకాకపోతే దానికి సంబంధించిన కారణాన్ని సంబంధిత అర్జీదారుడికి తెలియజేయడంతో పాటు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. డీఎల్‌పీఓ సుందరి, డీఎల్‌డీఓ వెంకటరత్నం, ఏడీఏ జీ విద్యాసాగర్, హెచ్ఓ ఆర్.హేమ పాల్గొన్నారు.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి


డ్రైవర్లకు సూచనలిస్తున్న సీఐ దాడి చంద్రశేఖర్

మైలవరం: రోడ్డు ప్రమాదాల విషయంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని సీఐ దాడి చంద్రశేఖర్ తెలిపారు. మైలవరంలోని బెస్ట్ హెవీ మోటార్ డ్రైవింగ్ స్కూల్‌ను సీఐ చంద్రశేఖర్ సోమవారం సందర్శించారు. తరగతి గదులు, ప్రొజెక్టర్, మెకానికల్ రూమ్, హాజార్డ్ క్లాస్ రూమ్‌ను పరిశీలించారు. అనంతరం శిక్షణ పొందుతున్న డ్రైవర్లకు ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, ప్రమాదాల అనంతరం డ్రైవర్లు పడే ఇబ్బందులను డ్రైవర్లకు వివరించారు. రాత్రి పూట డ్రైవర్స్ అందరూ స్టాప్, రీఫ్రెష్, గో అనే నినాదాలు తప్పక పాటించాలన్నారు. రోడ్డు మార్కింగ్, ట్రాఫిక్ సిగ్నల్స్, నైట్ డ్రైవింగ్ వంటి అంశాలను శిక్షణ పొందుతున్న డ్రైవర్లకు వివరించారు. శిక్షణ పొందిన డ్రైవర్లకు, శిక్షణ పొందని డ్రైవర్లకు తేడా ఉంటుందని, శిక్షణ లేని డ్రైవర్లు ఎక్కువ ప్రమాదాలు చేసే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ శిక్షకుడు వై. జమలయ్య, ప్రిన్సిపాల్ జే రవి కిరణ్, ఎస్.శ్రీరామ్, డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ జే అమరేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా పోలి పాడ్యమి పూజలు


ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద కృష్ణానదిలో దీపాలు వదులుతున్న భక్తులు


మైలవరం తారకరామానగర్‌లో నగర సంకీర్తనలో భక్తులు

ఇబ్రహీంపట్నం: కార్తిక మాసం ముగింపు సందర్భంగా పవిత్ర సంగమం వద్ద పోలి పాడ్యమి పూజలు సంప్రదాయ బద్ధంగా సోమవారం నిర్వహించారు. పోలీపాడ్యమి రోజున కృష్ణమ్మకు దీపాలు వెలిగించడం సంప్రదాయం. గ్రామాలు, కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో పలువురు భక్తులు వేకువ జామున సంగమం వద్దకు చేరుకున్నారు. స్నానఘాట్‌ల వద్ద పుణ్యస్నానాలు ఆచరించి దీపారాధన చేశారు. అరటి దొప్పలతో కృష్ణమ్మ ఒడిలో దీపాలు వదిలారు. పోలిస్వర్గం కథ చెప్పుకుని అక్షింతలు వేసుకున్నారు. బ్రాహ్మణులకు స్వయంపాక తాంబూలం సమర్పించారు. సమీపంలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు.


గోపవరంలో పోలిని సాగనంపుతున్న భక్తులు

శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, బిల్వార్చనలు జరిపారు. పెద్ద ఎత్తున భక్తులు పూజలు చేశారు.

మైలవరం: మైలవరం తారకరామానగర్ శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయం నుంచి సోమవారం భక్తులు నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే భక్తులు శ్రీసీతారామాంజనేయస్వామి వార్ల సంకీర్తనలు ఆలపిస్తూ ర్యాలీ నిర్వహించారు. వెల్వడంలోని శివాలయం వద్ద కోనేటిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి, మహిళలు అరటి దొప్పల్లో దీపాలు వదిలారు.

ముసునూరు: పోలిని సాగనంపడంతో కార్తికమాస పూజలు, వ్రతాలు, నోములు ఘనంగా ముగిసినట్లు బలివే రామలింగేశ్వరస్వామి ఆలయ ఈఓ పామర్తి సీతారామయ్య తెలిపారు. సోమవారం తెల్లవారు జామున పలువురు మహిళలు అరటి దొప్పల్లో దీపాలు వెలిగించి తమ్మిలేరులో వదిలి పూజలు చేశారు. గోపవరంలోని నాగేంద్రస్వామి ఆలయం వద్ద మహిళలు పోలిని సాగనంపారు.

కోడి పందేల శిబిరంపై దాడి

మైలవరం: మండలంలోని పుల్లూరు గ్రామం శివారు, పోరాటనగర్ గ్రామం శివారులో రహస్యంగా నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరంపై పోలీసులు మెరుపు దాడి చేసి 47 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.29,100, 10 కోడి పుంజులు, 10 కత్తులను స్వాధీన పర్చుకున్నట్లు సీఐ డీ చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఎస్ఐ కే సుధాకర్ సిబ్బందితో దాడి చేసినట్లు తెలిపారు. రెండు సారా కేసుల్లో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సోమవారం తెలిపారు. రెడ్డిగూడెంలో చాట్ల బండయ్య అనే వ్యక్తి నుంచి నాలుగు లీటర్ల సారాను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఒక పాత కేసులో నిందితుడు కోమటి గోపయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామని సీఐ తెలిపారు. ఎస్ఐ దుర్గాప్రసాద్, హెచ్‌సీ కుమారస్వామి, నాగరాణి, సిబ్బంది రమేష్, సాయికృష్ణ, రాజకుమార్ పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై..

చాట్రాయి: పేకాట శిబిరంపై దాడి చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ సోమవారం తెలిపారు. మండలంలోని పర్వతాపురం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామని తెలిపారు. ఈ దాడిలో 9 మంది జూదరులను అదుపులోకి తీసుకని వారి నుంచి రూ.26,350 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.